సాక్షి ఒడిశా
మంగళవారం । 21 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,12,327లు, బంగారం 6.5 గ్రాములు, వెండి 80.6 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అందరి నోట..చద్దన్నంమాట

- 8లో.



సంబరాలకు సిద్ధం

- 8లో.

న్యూస్‌రీల్

రాష్ట్రంలో కోవిడ్ ఛాయలు

● ఆస్పత్రిలో చేరిన బాధితుడు


నిరంజన్ మిశ్రా

భువనేశ్వర్: దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కోవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో క్రమంగా ఈ ఛాయలు బలపడుతున్నాయి. రాష్ట్రంలో 53మందిలో రోగ నిర్ధారణ జరిగినట్లు ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా సోమవారం తెలిపారు. వీరిలో ఒకరు చికిత్స కోసం ఆస్పత్రిలో చేరినట్లు పేర్కొన్నారు. రోజువారీ కోవిడ్ పాజిటివ్ సంఖ్య 12కంటే తక్కువగా కొనసాగుతుందన్నారు. గత కొన్ని రోజులుగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కోవిడ్ సంఖ్య పెరుగుతోంది. కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, రాజస్థాన్‌లో కొన్ని పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇతర వ్యాధులతో బాధపడుతున్న రోగులపై కోవిడ్ ప్రభావం కొంచెం ఎక్కువగా ఉంటుందని డైరెక్టర్ తెలియజేశారు. అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు.

గంజాయితో నిందితుడి అరెస్ట్


కారు, గంజాయితో పోలీసుల అదుపులో నిందితుడు

బరంపురం: గంజాం–కొందమాల్ జిల్లాల సరిహద్దు తప్పపాణి ఘాట్ రోడ్డులో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని బల్లిగుడా పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఓ నిందితుడిని అరెస్ట్ చేశారు. ఐఐసీ అధికారి తపన్‌కుమార్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం తప్పపాణి ఘాట్ రోడ్డు నుంచి బరంపురం మీదుగా అక్రమంగా గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు వాహన తనిఖీలు చేపట్టగా, అటుగా వస్తున్న కారులో గంజాయి మూటలు బయట పడ్డాయి. మొత్తం 35కిలోల సరుకుతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. బంజ్‌నగర్ జిల్లా గంగపూర్ గ్రామానికి సత్యజిత్ పాణిగ్రహిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

ప్రజలకు ఆయుర్వేదాన్ని చేరువ చేయాలి


ప్రతిభ చూపిన వైద్యులను సన్మానిస్తున్న డాక్టర్ బిపిన్ మిశ్రా

జయపురం: ఆయుర్వేద వైద్యం ఎంతో ప్రాచీనమైనదని, దీనిని ప్రజలకు మరింత చేరువ చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో దక్షిణ ఒడిశా ఆయుర్వేద వికాశ పరిషత్ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. డాక్టర్ సుదర్శన గౌఢ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బిపిన్ బిహారి మిశ్రా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజల్లో కొంతవరకు అవగాహన ఏర్పడిందన్నారు. దీనిని మరింత పెంపొందించాల్సిన అవశ్యకత వైద్యుల పైనే ఉందని తెలిపారు. వికాశ పరిషత్ ఉన్నతి కోసం నిధులు సమకూర్చినట్లు పేర్కొన్నారు. అల్లోపతి కంటే ఆయుర్వేదం నమ్మకమైన వైద్యమని, భారతీయ మూలాల నుంచే ఇది ప్రారంభమైందని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన 60మంది ఆయుర్వేద వైద్యులను సన్మానించారు. కార్యదర్శి పరమేశ్వర పాత్రొ వార్షిక నివేదిక వినిపించారు. కార్యక్రమంలో భాగంగా ఆయుర్వేద వైద్యంలో అనుభవాలపై అవగాహన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆయుర్వేద వికాశ పరిషత్ ఉపాధ్యక్షుడు క్షేత్రవాసి పండా, సహాయ కార్యదర్శి డాక్టర్ సత్యనారాయణ పరిచ, కోశాధికారి భభాణి చరణ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

వాయిదాల పర్వం!


స్పీకర్ పోడియం చుట్టుముట్టిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలు



- మెట్రిక్ పరీక్షల ప్రశ్న పత్రం లీక్‌పై అసెంబ్లీలో గందరగోళం
- పదే పదే స్పీకర్ పోడియం చుట్టుముట్టిన ప్రతిపక్షాలు
- గురువారానికి సభను వాయిదా వేసిన స్పీకర్ అరూఖ్
- ఆత్మహత్యలు, సైబర్ నేరాలపై హోంమంత్రి తుషార్ బెహరా సమాధానం

భువనేశ్వర్: మెట్రిక్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణలపై ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు గందరగోళం సృష్టించి సభా కార్యక్రమాలను స్తంభింపజేయడంతో అసెంబ్లీలో వాయిదాల పర్వం కొనసాగింది. ఉదయం సభ ప్రారంభమైన కొద్ది సేపటికే మెట్రిక్యులేషన్ గణితం ప్రశ్న పత్రం లీక్ అయ్యిందని ఆరోపిస్తూ బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరీక్షకు ముందే గణితం ప్రశ్న పత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని, దీనిపై విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. స్పీకర్ పోడియం చుట్టుముట్టి వీరంగం చేశారు. సభలో వాతావరణం గందరగోళంగా మారడంతో సభా కార్యకలాపాలు స్తంభించాయి. ఈ పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం లేకపోవడంతో స్పీకర్ బిక్రమ్‌కేశరి అరూఖ్ సభను వాయిదా వేశారు. ప్రశ్న పత్రం లీక్ కావడం లేదా పేపర్ వైరల్ కావడం వంటి ఘటనలు ఏవీ జరగలేదని, అంతా కల్పితమని సభ వెలుపల మీడియాతో మాట్లాడిన పాఠశాలలు, సామూహిక విద్యాశాఖ మంత్రి సమీర్ రంజన్‌దాస్ అభివర్ణించారు. ఈరోజు ప్రశ్న పత్రంలో అచ్చు తప్పు మాత్రం దొర్లిందని తెలిపారు.

మంత్రి రాజీనామా చేయాలి..

విద్యాశాఖ మంత్రి ప్రకటన అబద్ధమని బీజేపీ నాయకుడు, ప్రతిపక్ష చీఫ్ విప్ మోహన్ మాఝీ ఎదురు దాడి చేశారు. మెట్రిక్ పరీక్షల నిర్వహణలో అవకతవకలకు పాల్పడినందుకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి సమీర్ దాస్ రాజీనామా చేసి, విద్యాశాఖ మంత్రి హోదా నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు తారా ప్రసాద్ బహినీపతి సభ వెలుపల విలేకర్లతో మాట్లాడుతూ, కొన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళికాబద్ధంగా ప్రశ్నలు విడుదల చేశారని ఆరోపించారు. ఫలితంగా ప్రతిభావంతులు, మేధావంతులైన విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చర్చకు అవకాశమేదీ?

అసెంబ్లీ పని తీరుపై కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ(సీఎల్‌పీ) నాయకుడు నర్సింగ మిశ్రా రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యమైన, సున్నితమైన అంశాలపై సభలో చర్చకు నివారించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విపక్ష శాసన సభ్యులు నిరసన వ్యక్తం చేశారనే కారణంతో సభను దీర్ఘ కాలం పాటు వాయిదా వేయడం సరికాదని సభ వెలుపల మీడియాతో అన్నారు. సభ నడవడం రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టం లేదని, జీరో అవర్‌లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మాట్లాడేందుకు వీలు లేని పరిస్థితులను ప్రభుత్వం ప్రేరేపిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన సున్నితమైన సమస్యలపై చర్చను దాట వేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రశ్నలకు సభ్యులు సరైన సమాధానాలు పొందలేకపోతున్నారు. అధికార పార్టీ తీరుతో సభా గౌరవం దిగజారి పోతుందని అసంతృప్తి వ్యక్తంచేశారు.

రూ.104.55 కోట్ల సైబర్ మోసాలు

రాష్ట్రంలో గత ఐదేళ్లలో 2018నుంచి 2022 ఫిబ్రవరి వరకు సైబర్ మోసాలతో రూ.104.55 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని రాష్ట్ర హోంశాఖ సహాయ మంత్రి తుషార్‌కాంతి బెహరా అసెంబ్లీలో వివరాలను ప్రవేశ పెట్టారు. బిజు జనతాదళ్ సభ్యుడు సౌమ్యరంజన్ పట్నాయక్ అడిగిన ప్రశ్నకు ఐదేళ్ల వ్యవధిలో మొత్తం 6,567 సైబర్ మోసం కేసులు నమోదయ్యాయని రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఈ నేరాల్లో రూ.1,04,55,53,958లు నష్టం వాటిల్లిందని వెల్లడించారు. 2021లో అత్యధికంగా రూ.40,39,70,514లు సైబర్ మోసాలు నమోదైనట్లు వివరించారు. 2021 నేరాల గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సైబర్ నేరాల రేటు 4.4 నమోదు కాగా.. జాతీయ స్థాయిలో సైబర్ నేరాల రేటు 3.9గా నమోదైనట్లు మంత్రి తెలియజేశారు.


సమాధానం వినిపిస్తున్న మంత్రి తుషార్ బెహరా

సగటున 12 ఆత్మహత్యలు..

రాష్ట్రంలో రోజుకు సగటున 12 ఆత్మహత్యలు సంభవిస్తున్నట్లు శాసనసభ సమావేశాల్లో బయటపడింది. గత 7 సంవత్సరాల్లో జరిగిన ఆత్మహత్యల కేసులపై సమగ్ర సమాచారం విశ్లేషణాత్మక వివరాలను సభలో ప్రవేశ పెట్టాలని బీజేపీ చీఫ్ విప్ మోహన్‌మాఝి అడిగిన ప్రశ్నతో ఈ సంచలనాత్మక వివరాలు వెల్లడయ్యాయి. ఆయన ప్రశ్నకు బదులుగా రాష్ట్ర హోంశాఖ సహాయమంత్రి తుషార్‌కాంతి బెహరా సభలో ప్రవేశ పెట్టిన వివరాలు రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న ఆత్మహత్య ఘటనలపై ఆందోళన కలిగిస్తున్నాయి. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం 2016–2020 మధ్య రాష్ట్రంలో ఆత్మహత్య కారణంగా 22,600 మరణాలు నమోదయ్యాయి. ఏటా 4,500మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ లెక్కన రోజుకు 12 చొప్పున ప్రతి నెలా 380 ఆత్మహత్యలు జరుగుతున్నాయని తేలింది. చీఫ్ విప్ అభ్యర్థన మేరకు విభాగం వద్ద లింగ, వయసు, కార్మిక, ఉపాధి తదితర విశ్లేషణాత్మక సమాచారం లేనట్లు మంత్రి ప్రకటించారు.

బడ్జెట్ ప్రతిపాదనలపై సమాలోచన


శ్రీమందిరం సీఏఓ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక ఉపసంఘం

● సమావేశమైన శ్రీమందిరం ఆర్థిక ఉపసంఘం

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయ కార్యాలయంలో ఆర్థిక ఉపసంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రధాన పాలనాధికారి(సీఏఓ) వీర్ విక్రమ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీమందిరం 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలు, 2022–23 బడ్జెట్ వినియోగంపై చర్చించారు. త్వరలో జరగనున్న పాలకమండలి సమావేశంలో బడ్జెట్‌ను ఆమోదించనున్నట్లు ప్రకటించారు. గత ఏడాది తరహాలో ఈ ఏడాది కూడా మిగులు బడ్జెట్ అంచనాలు చర్చకు వచ్చినట్లు సీఏఓ తెలిపారు. గ్రాంట్–ఇన్–ఎయిడ్ మీద ఆధారపడకుండా స్వతంత్ర వనరులతో ముందుకు సాగే యోచనతో ఆదాయ వనరుల్ని సమీకరించనున్నామన్నారు. ప్రధానంగా జగన్నాథుని భూముల సద్వినియోగంతో ఆదాయం పెంపొందించే యోచిస్తున్నామని పేర్కొన్నారు. భూముల విక్రయం, సులభ రీతిలో వివాదల పరిష్కారం ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదానికి సిఫార్సు చేశామన్నారు. ప్రభుత్వ అనుమతి లభించడంతో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కొత్త సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనల్లో రూ.300 కోట్ల 79 లక్షల ఆదాయం, రూ.262 కోట్ల 49 లక్షల వ్యయ అంచనాలతో సమగ్రంగా రూ.38 కోట్ల 30 లక్షల మిగులు బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ సమర్థవర్మ, చార్టర్డ్ అకౌంటెంట్, ఫైనాన్స్ సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంచే చేను మేసింది!


కానిస్టేబుల్ మానోజ్‌కుమార్ ముదిలి

మల్కన్‌గిరి: గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసు సిబ్బందే.. గంజాయి వ్యాపారికి సహకరిస్తూ పట్టుబడ్డాడు. మల్కన్‌గిరి జిల్లాలోని మర్కపల్లి గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మల్కపల్లి గ్రామానికి చెందిన శరత్‌చంద్ర ఛలాన్ అనే వ్యక్తి గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. అతనిని అరెస్ట్ చేసిన మల్కన్‌గిరి పోలీసులు.. విచారణ చేయగా కాకీల సాయంతోనే వ్యాపారం సాగిస్తున్నట్లు తేలింది. విషయాన్ని ప్రత్యేకంగా తీసుకున్న మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో.. గంజాయి వ్యాపారికి సహకరిస్తున్న కానిస్టేబుల్ మనోజ్‌కుమార్ ముదిలిని స్వయంగా అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాను అరికట్టడంతో నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

సంబరాలకు చాటింపు

బరంపురం: నగరంలోని మాబుడి శాంతమ్మ సంబరాలకు చురుగ్గా సాగుతున్నాయి. ఏప్రిల్ 4న అర్ధరాత్రి నుంచి పారంభం కానున్న ఈ ఉత్సవాలకు సంబంధించి స్థానిక దేశీ బెహరా వీధిలో బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తాత్కలిక ఆలయం నిర్మాణం చేపట్టారు. మరోవైపు బరంపురం సబ్ కలెక్టర్ కార్యలయంలో నిర్వాహకులు దుర్గాప్రసాద్ దేశీబెహరా బృందంతో సబ్ కలెక్టర్ కులకర్ణి అసుతోష్‌తో సోమవారం సమావేశమయ్యారు. ఏర్పాట్లపై చర్చలు జరిపారు. దేశీబెహరా ఇంటి నుంచి ఘటాలు బయలు దేరి, తిరిగి గర్భగుడి, తాత్కాలిక ఆలయానికి చేర్చేందుకు రూట్ మ్యాప్‌ను ఎస్పీ సరవణ్ వివేక్ సిద్ధం చేసినట్లు తెలిపారు. అమ్మవారు గ్రామంలోకి వచ్చిన సమయంలో ప్రత్యేక పోలీసు భద్రత చేపట్టనున్నారు. అలాగే ఉత్సవాలకు సంబంధించి వీధుల్లో చాటింపు కార్యక్రమం సంప్రదాయంగా కొనసాగింది.


దండోరా వేయిస్తున్న నిర్వాహకులు దుర్గాప్రసాద్ దేశీబెహరా

●దొండనచో దీక్షలు ప్రారంభం


ఎండలో రోడ్డుపై పడుకొని దీక్ష కొనసాగిస్తున్న భక్తులు

చైత్రమాసం ప్రవేశంతో గంజాం జిల్లాలో ప్రసిద్ధి చెందిన దండనచో దీక్షలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆది, సోమవారాల్లో నగరంలోని గాంధీనగర్, హరదాఖండి, సిటీ హాస్పిటల్ రోడ్డు, పాడు వీధుల్లో దొండనచో బృందాల దీక్షాధారుల ప్రదర్శనలు జరిగాయి. సంప్రదాయాలకు అనుగుణంగా మిట్ట మధ్యాహ్నం ఎండలో కఠోర దీక్షలు, గడ్డి ఉండలతో అగ్నికీలల ప్రదర్శనలు చేపట్టారు. ఉదయమంతా ఉపవాసం ఉన్న దీక్షాధారులు సాయంత్రం చెరువుల్లో స్నానం చేసిన అనంతరం ప్రసాద స్వీకరించారు. దొండకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. –బరంపురం


గాంధీనగర్‌లో దండొనచో దీక్ష పూజలు

పిచ్చుకలను పరిరక్షించుకుందాం

● డీఎఫ్‌ఓ రవీంద్రకుమార్ మిశ్రా పిలుపు

బరంపురం:

వివిధ కారణాలతో అంతరిస్తున్న పిచ్చుకలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గంజాం జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రకుమార్ మిశ్రా కోరారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో అంచలిక వికాశ్ పరిషత్ సహకారంతో నగర శివారులోని గుండలా గ్రామంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పిచ్చుకలు అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధిక రేడియేషన్, కాలుష్యమే దీనికి కారణమని అభిప్రాయం వ్యక్తంచేశారు. గతంలో ఇళ్లల్లో పిచ్చుకలు స్వయంగా గూడు కట్టుకొని నివసించేవని, ఇప్పుడా పరిస్థితి లేకపోవడం దురదృష్టకరమన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషించే పిట్టలను కాపాడుకుంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సూచించారు. దీనికి అనుగుణంగా కృత్రియ గూళ్లను ఇళ్ల వద్ద ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. దీనికి అనుగుణంగా ఈ ఏడాది జిల్లాలోని 450 పాఠశాలల్లో చెక్కతో తయారు చేసిన గూళ్లను పంపిణీ చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ అధికారులు, విద్యార్థులు గ్రామంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు.


గొండలా గ్రామస్తులకు పిచ్చుక గూళ్లు అందిస్తున్న డీఎఫ్‌ఓ రవీంద్రకుమార్ మిశ్రా

చెక్కతో పిచ్చుకలు..

బరంపురం: నగరంలోని నీలకంఠనగర్ 3వ లైన్‌కు చెందిన సైకతశిల్పి సత్యనారాయణ మహరాణ తన కళా నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. సోమవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా చెక్కతో పిచ్చుక బొమ్మలను తయారు చేశారు. పిచ్చుకలను రక్షించుకుందామని చైతన్యపరస్తూ సందేశానిచ్చారు.



చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న అంచలిక వికాశ్ పరిషత్ సభ్యులు, విద్యార్థులు


చెక్కతో సత్య మహరాణ తయారు చేసిన పిచ్చుకలు

క్లుప్తంగా

పింఛన్ పెంచాలని వినతి



నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వృద్ధులు

జయపురం: ప్రభుత్వ అందజేస్తున్న వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పెన్షన్ మొత్తాన్ని పెంచాలని, అలాగే ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లించాలని జయపురం పట్టణ, సమితిలోని పింఛన్ లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు సామాజిక కార్యకర్త బి.హరిరావు ఆధ్వర్యంలో వందలాది మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు జయపురం రథపాడియా నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కేవలం రూ.500లు మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని, చుట్టుపక్కల రాష్ట్రాల్లో రూ.2 వేలకు పైగా ఇస్తున్నారని తెలియజేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, ఖర్చులను దృష్టిలో పెట్టుకొని పెన్షన్ మొత్తాన్ని పెంచాలన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఇంటి వద్దకే వచ్చి, పింఛన్ అందిస్తున్న తరహాలో ఒడిశాలో కూడా వృద్ధులు, దివ్యాంగులకు బ్యాంకు ఖాతాలో నగదు జమ చేసేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

70 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత



అధికారులు పట్టుకున్న బియ్యం బస్తాలు, వ్యాన్

సరుబుజ్జిలి: సారవకోట మండలం బుడితి గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న 70 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని సరుబుజ్జిలి జంక్షన్లో సోమవారం పట్టుకున్నామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. బూర్జ మండలానికి చెందిన వండాన చిన్నంనాయుడు, సవర బిజియో బొలేరో వ్యాన్‌లో బియ్యాన్ని అమ్మకానికి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్థానంగా ఉన్న సివిల్ సప్లయ్ గొడౌన్‌కు, వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు విజిలెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్సై ఎస్.అశోక్ చక్రవర్తి, సీఎస్‌డీటీ డబ్బీరు రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ అప్పన్న, కానిస్టేబుళ్లు శేషగిరి, ఈశ్వరరావు, వీఆర్వో ధర్మారావు పాల్గొన్నారు.

టైర్ పంక్చరై అదుపుతప్పిన బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. 16వ నంబర్ జాతీయ రహదారిపై ఫరీదుపేట పంచాయతీ కొయ్యరాళ్ల కూడలి వద్ద ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తున్న బస్సు కొద్ది నిమిషాల్లో కాంప్లెక్స్‌కు చేరుకోవాల్సి ఉంది. అయితే కొయ్యరాళ్ల సమీపంలో బస్సు టైరు పంక్చరైంది. దీంతో ఒక్కసారిగా ఐరన్ గ్రిల్స్‌తో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. అయితే ఈ ఘటనలో ప్రయాణికులెవరూ గాయపడలేదు. బస్సు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ప్రమాద సమాచారాన్ని డ్రైవర్ అధికారులకు తెలియజేశారు. వెంటనే స్పందించిన అధికారులు మరో బస్సును రప్పించి ప్రయాణికులను పంపించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, హైవే సిబ్బంది క్రేన్ సహాయంతో బస్సును రోడ్డు పక్కకు తొలిగించారు. ప్రమాద సమయంలో వాహనాలు ఏమీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎచ్చెర్ల పోలీసులు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పోటీల్లో విజేతలుగా నిలవాలి

శ్రీకాకుళం క్రైమ్: పూణేలో జరగనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రాణించి విజేతలుగా తిరిగి రావాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారిణులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని జిల్లా పోలీసు కార్యాలయానికి సోమవారం పిలిపించుకొని ఆల్‌దిబెస్ట్ చెప్పారు. అలాగే కాకినాడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన నలుగురు క్రీడాకారిణులను కూడా ఆమె అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

క్రీడాకారిణుల వివరాలు..

మహారాష్ట్రలోని పూణే వేదికగా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు జరగనున్న సీనియర్ విభాగం పోటీలకు జిల్లా నుంచి ఫోయిల్ విభాగంలో బడి పూజిత, ఇప్పీ విభాగంలో గురుగుబెల్లి అక్షయ ఎంపికయ్యారు. అలాగే ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ వేదికగా ఈ నెల 10, 11 తేదీల్లో జరిగిన సీనియర్ ఇంటర్ జిల్లా పురుషులు, మహిళల విభాగంలో నలుగురు క్రీడాకారిణులు సత్తా చాటారు.

అందరి నోట.. చద్దన్నం మాట



వ్యవసాయ మంత్రి రణేంద్రప్రతాప్ స్వాయి



భారత హాకీ సమాఖ్య అధ్యక్షుడు దిలీప్ టిర్కీ



పదమపూర్ ఎమ్మెల్యే బర్షా సింగ్ బరిహా



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చద్దన్నం ఆరగింపు

- సంప్రదాయంగా పాఖాలో దివాస్
- చద్దన్నం విందు ఆరగించిన సీఎం నవీన్, ప్రముఖులు

భువనేశ్వర్:

వివిధ రకాల ఒడియా వంటకాల్లో పాఖాలోది అగ్రస్థానం. ధనిక, పేద, బడుగు వర్గాల అత్యంత ఇష్టమైన నిత్య ఆహారం. ఈ ప్రత్యేకతతో ఒడియా వంటకంగా ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. రాష్ట్ర ప్రజల జీవన శైలిలో భాగమై సుస్థిర స్థానం చేజిక్కించుకుంది. ప్రజలకు ఇది సాదాసీదా ఆహారం మాత్రమే కాదు.. ఆహార అలవాట్ల పట్ల ప్రేమ, గౌరవం నిబద్ధతకు స్పష్టమైన రుజువుగా పాఖాలో నిలుస్తుందని పలువురు ప్రముఖులు కొనియాడారు. సోమవారం పాఖాలో దివాస్ పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఒడియా ప్రజలు ప్రత్యేక విందుతో వేడుకలు నిర్వహించుకున్నారు. సామాన్యుడి నుంచి అగ్రస్థాయి నేతల వరకు వేడుకలు జరుపుకోవడం విశేషం. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మొదలుకొని శాసనసభ సభ్యులు, మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, క్రీడా, సినీ ప్రముఖులు, ఉన్నతాధికారులు సైతం పాఖాలో దిబొసా పురస్కరించుకుని చద్దన్నం విందుతో శుభాకాంక్షలు తెలిపారు. భువనేశ్వర్ లోని సాహిద్‌నగర్ దుర్గా మండపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాఖాలో విందులో భారతీయ జనతాపార్టీ రాష్ట్రశాఖ ప్రముఖులు, కార్యకర్తలు సామూహికంగా పాల్గొన్నారు. శాసనసభ ప్రతిపక్ష నేత జయనారాయణ మిశ్రా, రాష్ట్రశాఖ అధ్యక్షుడు సమీర్ మహంతి తదితర ప్రముఖులు పాలుపంచుకున్నారు.



కుటుంబీకులతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పాఖాలో విందు

శరీరానికి ఎంతో శక్తి..

పర్లాకిమిడి: వేసవిలో చద్దన్నం తినడం ద్వారా శరీరానికి ఐరన్, విటమిన్స్, శక్తి లభిస్తుందని పర్లాకిమిడి సబ్ జైలు సూపరింటెండెంట్ హన్ను శెఠి అన్నారు. సోమవారం పాఖాలో దివాస్(చద్దన్నం దినోత్సవం) సందర్భంగా పట్టణంలోని యూటెక్ కంప్యూటర్ కేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షురాలు తనూజా శత్పథితో కలిసి ఆయన ప్రారంభించారు. పూర్వీకులు చద్దన్నాలు తినడం ద్వారా జీర్ణశక్తి పెరగటమే కాకుండా పొలాల్లో రోజంతా పనిచేసే శక్తి లభించేదని తెలిపారు. ఫాస్ట్‌ఫుడ్, బర్గర్, పిజ్జాల కంటే చద్దన్నం శరీరానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. దివంగత కృష్ణచంద్రగజపతి నారాయణదేవ్ ప్రత్యేక ఒడిశా కోసం బ్రిటీష్ వారితో పోరాడినప్పుడు లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో వారికి చద్దన్నం పరిచయం చేసినట్లు బినోదిని సైన్స్ కళాశాల అధ్యక్షుడు మనోజ్ పట్నాయక్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పాఖాలో పోటీల్లో పాల్గొని, విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా వ్యాఖ్యాతగా, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, స్టేట్‌బ్యాంకు విశ్రాంత అధికారి హరిమోహన్ పట్నాయక్, నర్సింగ పట్నాయక్, లోకనాథ మిశ్రా తదితరులు పాఖాలో ప్రాముఖ్యతపై మాట్లాడారు. అనంతరం అతిథులకు చద్దన్న, గంజి, బంగాళదుంప వేపుడు, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, అప్పడాలతో పాఖాలో వడ్డించారు.

పాఖాలో గొప్ప అనుభూతి

ఒడియా రుచికరమైన వంటకాలకు అంకితమైన రోజు పాఖాలో దిబొసా. రాష్ట్ర ప్రజలు అత్యంత ఇష్టపడే నిత్య ఆహారం పాఖాలో. ఇదో గొప్ప అనుభూతిగా పాఖాలో ప్రియులకు అంతర్జాతీయ సైకతశిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. పాఖాలో దిబొసా సందర్భంగా పూరి బీచ్‌లో ఆవిష్కరించిన ఆకర్షణీయమైన సైకత శిల్పం అందరినీ ఆకట్టుకుంది.





పర్లాకిమిడి: చద్దన్నం తింటున్న అధికారులు



చద్దన్నం ఆరగిస్తున్న ప్రతిపక్ష నాయకుడు జయనారాయణ మిశ్రా, బీజేపీ ప్రముఖులు

సంబరాలకు సిద్ధం

- నేటి నుంచి ఉగాది ఉత్సవాలు

పర్లాకిమిడి: పట్టణంలోని రాంనగర్ హైటెక్ ప్లాజా వద్ద ఈనెల 21, 22 తేదీల్లో ఉగాది వేడుకలు తెలుగు, ఒడియా సంస్కృతుల సమన్వయ వేదికలో జరపనున్నట్లు హైటెక్ సంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి సోమవారం తెలియజేశారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ముగ్గుల పోటీలు చేపట్టనున్నారు. 22న సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 11గంటల వరకు చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ నటులు బుల్లెట్ భాస్కర్, అప్పారావు బృందం ప్రదర్శనలు, ఇండియన్ ఐడల్ గాయకులు వైష్ణవి, యాషికా, కశ్యప్, రేణుకుమారి సినీ గానలహరి నిర్వహించనున్నారు. అలాగే ప్రముఖ నటులు సుమన్, బాబూమోహన్ ప్రత్యేక అతిథులుగా హాజరు కానున్నట్లు వివరించారు.

మహిళలకు పోటీలు..

జయపురం: జయపురం తెలుగు సంస్కృతి సమితి, రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు సహకారంతో నిర్వహించనున్న ఉగాది ఉత్సవాల్లో మహిళలకు వివిధ పోటీలు జరిపారు. మెహందీ, మ్యూజికల్ చైర్, వంటల పోటీలు నిర్వహించారు. 21న లాన్ ప్రాంగణంలో జరుగనున్న తొలి రోజు వేడుకలకు సిత్తరాల సిరపడు గేయ రచయిత బల్లా విజయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే జానపద గాయకులు జానకిరామ్ బృందం రేలరే రేల కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు.

నాలుగో రోజుకు పోటీలు..

రాయగడ: స్థానిక తేజస్విని హోటల్ ఎదురుగా ఉన్న మైదానంలో జరుగున్న ఉగాది ఉత్సవ పోటీలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా చిన్నారుల మధ్య డ్యాన్స్ పోటీలు నిర్వహించగా, పట్టణ ప్రముఖులు రాఘవ కుముంధాన్, రవిబాబు అతిథులుగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు మహిళల మధ్య నిర్వహించిన మ్యూజికల్ చైర్ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నెక్కంటి కృష్ణచైతన్య, ఉత్సవ కమిటీ కోశాధికారి ఇప్పిలి సన్యాసిరాజు, పీవీపీ రాము, బాలకృష్ణ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో చిన్నారుల నృత్యాలు



రాయగడ: పోటీలను ప్రారంభిస్తున్న రాఘవ కుముంధాన్



జయపురం: మెహందీ పోటీలో పాల్గొన్న మహిళలు

ముగిసిన పరీక్షలు

- ఏప్రిల్ 3నుంచి మెట్రిక్ జవాబు పత్రాల మూల్యాంకన
- రాష్ట్రవ్యాప్తంగా 56 కేంద్రాలు ఏర్పాటు

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు(బీఎస్ఈ) ఆధ్వర్యంలో నిర్వహించిన మెట్రిక్ పరీక్షలు సోమవారంతో పూర్తయ్యాయి. జవాబు పత్రాలు దిద్దడంతో టేబులేషన్ తదితర అనుబంధ ప్రక్రియ ముగించి ఫలితాలు సకాలంలో ప్రకటించేందుకు చురుగ్గా సన్నాహాలు చేస్తున్నారు. ఏప్రిల్ 3నుంచి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభం కానుంది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా 56 కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు బీఎస్ఈ అధ్యక్షుడు రమాశిష్ హజ్రా వెల్లడించారు. ఏప్రిల్ వారంలోగా పరీక్ష ఫలితాలు ప్రకటించేందుకు నిర్ణయించామన్నారు. మెట్రిక్ పరీక్షలు ఈనెల 10నుంచి ప్రారంభమై సోమవారం జరిగిన గణితం పరీక్షతో ముగిశాయి. ఈ ఏడాది కొత్త పద్ధతిలో నిర్వహించిన పరీక్షలకు దాదాపు 5 లక్షల 50వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. బోర్డు పరీక్షకు బదులుగా, ద్వితీయ సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించారు. దీనికి ముందు పాఠశాలలో విద్యార్థులకు 20మార్కులకు ఇంటర్నల్ పరీక్ష జరిగింది. ఈ ఏడాది కూడా పరీక్షల సీజన్‌లో స్వల్ప వివాదాలు తెరకెక్కాయి. అచ్చు తప్పులు, ప్రశ్న పత్రాలు లీక్ వంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. సాంఘికశాస్త్రం ప్రశ్న పత్రంలో తప్పులు దొర్లాయి. గణితం ప్రశ్న పరీక్ష సమయానికి ముందే ప్రసారమైనట్లు ప్రసారమైన వార్తలతో రాష్ట్ర శాసనసభలో తీవ్ర దుమారం రేగింది. ఈ ఏడాది పరీక్షల ఆరంభం నుంచి చాలామంది విద్యార్థులు హాజరు కాకపోవడం కలవరం రేపింది. ఈ పరిస్థితి సర్వత్రా ఆందోళన ప్రేరేపించింది



ఆనందాన్ని పంచుకుంటున్న విద్యార్థులు



పర్లాకిమిడి: మహారాజా బాలుర ఉన్నత పాఠశాల కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

437మంది గైర్హాజరు..


రాయగడ: జిల్లాలో విద్యార్థుల సౌకర్యం కోసం 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 11,147 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 437మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భోరియా తెలిపారు. సోమవారంతో పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. ఒకరికొకరు రంగులు జల్లుకుని, ఆనందాన్ని పంచుకున్నారు.

గజపతి జిల్లాలో ప్రశాంతంగా..

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గత 20రోజులుగా జరుగుతున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో మొత్తం నాలుగు నోడల్ కేంద్రాల్లో ప్రశ్న పత్రాలను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆధీనంలో భద్రపరిచారు. పోలీసు బలగాల పర్యవేక్షణలో 35 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. 7312మందికి గాను 7067మంది విద్యార్థులు హాజరయ్యారని నోడల్ కేంద్రం సూపరింటెండెంట్ డి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఓపెన్ స్కూల్ నుంచి 10 పరీక్షలకు 104మంది దరఖాస్తు చేసుకోగా, 95 మంది పరీక్ష రాశారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఎం.సత్యనారాయణ, పర్యవేక్షకుడిగా సాత్విక్ పట్నాయక్ వ్యవహరించారు.

భయపెట్టిన పాములు





సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం, టెక్కలి మండలం విక్రంపురంలో పాములు జనావాసాల్లోకి వచ్చి భయపెట్టాయి. పురుషోత్తపురంలో స్థానిక రైస్ మిల్లు పక్క నుంచి సోమవారం ఉదయం సుమారు పది అడుగుల పసిడికి పాము జనాల్లోకి వచ్చింది. దీంతో కొంతమంది యువకులు ధైర్యం చేసి కర్రలతో కొట్టి చంపారు. అలాగే విక్రంపురంలో ఆదివారం రాత్రి నలుపు, పసుపు ఛారలతో ఉన్న సుమారు 15 అడుగుల పాము వీధుల్లోకి వచ్చింది. గతంలో ఎప్పుడూ ఇలాంటి పామును చూసి ఉండకపోవడంతో భయాందోళన చెందారు. కొంతమంది కర్రలతో వెంబడించడంతో సమీపంలోని చెరువు వైపు వెళ్లిపోయింది. కాగా ఈ పామును గౌరీబెత్తుగా పిలుస్తారని స్థానికులు తెలిపారు.

- సరుబుజ్జిలి, టెక్కలి రూరల్

బంగారం చోరీపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: ఏఎస్ఎన్ కాలనీలో తులంన్నర బంగారు కాసులు చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందిందని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. సోషల్ వెల్ఫేర్ ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తూ.. ఏఎస్ఎన్ కాలనీలో నివాసముంటున్న ప్రగాఢ అశోక్‌కుమార్ కుటుంబంతో కలిసి ఈ నెల 16న తిరుపతి వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి చూసే సరికి మెయిన్ డోర్, గ్రిల్స్‌కు వేసిన తాళాలు తీసి ఉండడంతో ఆందోళన చెందారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉంచిన బంగారం కాసులు పోయినట్టు గుర్తించి తమకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఎస్ఐ వెంకటేష్, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఘటనాస్థలికి వెళ్లి దర్యాప్తులో భాగంగా పరిశీలించి వేలిముద్రలు సేకరించారు.

జీతాల చెల్లింపునకు సహకరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జీతాల్లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న డీఎస్సీ-2002 హిందీ భాషా పండితులకు జీతాల చెల్లింపు ప్రక్రియలో సహకరించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షుడు పిసిని వసంతరావు, సహాధ్యక్షుడు కుప్పన్నగారి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు జిల్లా ఖజానాశాఖాధికారి సి.హెచ్.రవికుమార్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాల సమస్యకు పరిష్కారంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని అందించారు.

ముగిసిన బాడీబిల్డింగ్ పోటీలు

మిస్టర్ ఆంధ్రా చాంపియన్‌గా సంతోష్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ:

శ్రీకాకుళం జిల్లా స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా రెండు రోజులు జరిగిన 25వ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం అర్ధరాత్రితో ముగిశాయి. చాంపియన్‌గా పార్వతీపురం పట్టణానికి చెందిన పడాల సంతోష్‌కుమార్ నిలిచాడు. బిలో 55 కేజీలు, 60, 65, 70, 75, 80, 85, 90 కేజీలు, మాస్టర్స్ బరువు కేటగిరీల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి అధికసంఖ్యలో క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు.

క్రీడాస్ఫూర్తి ముఖ్యం

ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. బాడీబిల్డింగ్ చేయడంతో శారీరక ధారుఢ్యంతో పాటు అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చన్నారు. శ్రీకాకుళంలో వరుసగా తొమ్మిదిసార్లు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి పదోసారి కూడా విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసిన విజయ్‌కుమార్ బృందాన్ని అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకరి కృష్ణకుమార్ మాట్లాడుతూ.. బాడీబిల్డింగ్ క్రీడ ఎంతో ఖర్చుతో కూడుకున్నదన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించడం విజయ్‌కే సాధ్యమైందన్నారు. టీపీడీ నాయకుడు గొండు శంకర్ మాట్లాడారు. పోటీలు విజయవంతానికి సహకరించిన వారికి ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డర్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జిల్లాకు చెందిన ఇంటర్నేషనల్ బాడీబిల్డర్ అల్లిబిల్లి సత్యన్నారాయణ, నేషనల్ బాడీబిల్డర్ బి.సూరిబాబు, ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్, జిల్లా అధ్యక్షులు బలగ ప్రసాద్‌లను.. సుంకరి కృష్ణ, గొండు శంకర్, గోపాల్ ఫిట్‌నెస్ జిమ్ అధినేత పి.గోపాల్ దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అంధవరపు సూరిబాబు, మాదారపు వెంకటేష్, మాదారపు డేవిడ్, మండలి మనోజ్‌కుమార్, మజ్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మిస్టర్ ఆంధ్రా చాంపియన్ టైటిల్‌ను అందుకుంటున్న పడాల సంతోష్‌కుమార్

క్లుప్తంగా

శ్రీరామనవమి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు

- ఆర్డీఓ సూర్యకళ



శ్రీరామనవమి వేడుకలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ లాంఛనాలతో ఈ నెల 30న జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ సూర్యకళ ఆదేశించారు. రాములోరి సన్నిధిలో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు సుమారు 25వేల మంది భక్తులు వచ్చే అవకాశముందన్నారు. కల్యాణం అనంతరం తలంబ్రాల పంపిణీలో తోపులాటలు జరగకుండా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ రమణరాజు, ఈఓ ప్రసాదరావు, ఎస్సై నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

4 లక్షల టన్నుల చెరకు క్రషింగ్

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో 4 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయిందని కర్మాగారం అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగేశ్వరరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరకు పంట నరికేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం వాతావరణం బాగుండడంతో అన్ని గ్రామాల్లో చెరకు నరికేందుకు రైతులు ముందుకొచ్చారని, ప్రతిరోజు సుమారు 4వేల టన్నుల చెరకు క్రషింగ్ చేస్తున్నట్టు వెల్లడించారు. కర్మాగారానికి చెరకును తరలించిన వారంరోజులకే రైతుల ఖాతాలకు బిల్లులు జమచేస్తున్నామన్నారు. రైతుల సంక్షేమమే ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం ధ్యేయమని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థిని



జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన హారిక

నెల్లిమర్ల: పట్టణంలోని వేణుగోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఎ.హారిక జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 22వ తేదీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని వారణాశిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున తలపడనుంది. హారికను గురుకులాల జిల్లా సమన్వయాధికారి బి.చంద్రావతి, పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, పీడీ వీరమణి, పీఈటీ అప్పలనరసమ్మ అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఇంటర్మీడియట్ పరీక్షకు 26,887మంది హాజరు

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం ఉమ్మడి జిల్లాలో సోమవారం ఇంటర్మీడియట్ ఫస్టియర్ గణితం, సివిక్స్, బోటనీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 26,887 మంది విద్యార్థులు హాజరుకాగా 1773 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 6,121 మందికి 5,368 మంది హాజరయ్యారు. ఆర్ఐఓ రెండు, డీఈసీ నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 45, మిగిలిన అధికారులు 8 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్టు ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ తెలిపారు.

సుజలస్రవంతికి భూసేకరణ

- ఇన్‌చార్జి ఆర్డీఓ పద్మలత

బొబ్బిలి: సుజల స్రవంతి ప్రాజెక్టుకు అవసరమైన ఐదువేలు ఎకరాల భూసేకరణ ప్రక్రియ జోరందుకుందని ఇన్‌చార్జి ఆర్డీఓ పి.పద్మలత తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తన యూనిట్ పరిధిలోని నాలుగు మండలాల్లో 2,700 ఎకరాలను సేకరిస్తున్నామన్నారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. తోటపల్లి ప్రాజెక్టుకు సంబంధించి పిల్ల కాలువల నిర్మాణానికి నాలుగు ఎకరాల మినహా మిగిలిన భూ సేకరణ పూర్తయిందన్నారు.

ధీర ఫౌండేషన్ ఆపన్న హస్తం

విజయనగరం: పట్టణానికి చెందిన ధీరా ఫౌండేషన్ అధ్యక్షుడు బొత్స సందీప్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. నగరంలోని లంకవీధి ప్రాంతానికి చెందిన రామిరెడ్డి వాసు గత కొంతకాలంగా అనారోగ్యంతో తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ కోసం రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద అయిన వాసు వద్ద చికిత్సకు అవసరమైన డబ్బులు లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ధీర ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బొత్స సందీప్ వాసుకు వైద్యం అందిస్తున్న డాక్టర్లతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అదేవిధంగా వైద్య ఖర్చుల కోసం బాధితుడి భార్య రామిరెడ్డి శ్రీవల్లికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ట్రాక్టర్ల చోరీ నిందితుల అరెస్ట్

- ట్రాక్టర్ ఇంజిన్, మూడు ట్రక్కులు, రూ.4.50 లక్షల రికవరీ



కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలో ట్రాక్టర్ల దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఒక ట్రాక్టర్ ఇంజిన్, మూడు ట్రక్కులు, రూ.4.50 లక్షలు నగదు రికవరీ చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని ఎస్.కోట, ఎల్.కోట, జామి, డెంకాడ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ట్రాక్టర్ దొంగతనాలను దృష్టిలో పెట్టుకుని, ఈ తరహా నేరాలను నియంత్రించేందుకు కేసుల మిస్టరీని ఛేదించేందుకు ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో సీసీఎస్, జామి, ఎస్.కోట పోలీసులతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఈ బృందాలు ఈ తరహా నేరాలకు పాల్పడిన నేరస్తులను రాష్ట్రవ్యాప్తంగా విచారణ చేసి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టాయి. జామి మండలం అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న శ్రీకాకుళపు నాగరాజు అనే వ్యక్తిని జామి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, తాను, కొత్తవలస మండలం వియ్యంపేటకు చెందిన నాగులాపల్లి గణేష్, మరో జువైనల్ సహకారంతో బృందంగా ఏర్పడి, ఊరికి చివరగా ఉన్న వ్యవసాయ కళ్లాల్లో ఉన్న పాత ట్రాక్టర్లను దొంగిలించి, వాటి రూపురేఖలు మార్పు చేసి, స్క్రాప్ షాపులకు విక్రయించేవారని తెలిసింది.

అప్పుల బారి నుంచి బయటపడేందుకు..

నిందితులు ఇటుక బట్టీల్లో పనిచేస్తూ, బట్టీ యజమానుల దగ్గర అడ్వాన్సుగా డబ్బులు తీసుకుని, తిరిగి చెల్లించకపోవడంతో అప్పులబారిన పడ్డారు. అప్పుల బారినుంచి బయట పడేందుకు గాను జామి మండలంలో ఒకటి, ఎస్.కోట మండలంలో రెండు, ఎల్.కోట మండలంలో ఒకటి, డెంకాడ మండలంలో ఒకటి, విజయనగరం మండలంలో మరొకటి వెరసి మొత్తం ఆరు ట్రాక్టర్లను దొంగిలించినట్లు పోలీసుల విచారణలో నిందితులు వెల్లడించారు. ఈ కేసుల్లో గణేష్‌ను అరెస్టు చేసి, ఒక ట్రాక్టర్ ఇంజిన్, మూడు ట్రక్కులు, ట్రాక్టర్లను స్క్రాప్ షాపులకు విక్రయించిన నగదులో రూ.4.050 లక్షలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ నేరాల్లో రూరల్ పీఎస్‌కి చెందిన మరో ట్రాక్టర్‌ను కడపకు చెందిన బాలకృష్ణారెడ్డి అనే వ్యక్తి నుంచి రికవరీ చేయాల్సి ఉంది. ఆరు కేసుల్లో ఎటువంటి ఆధారాలు లభించనప్పటికీ జామి ఎస్సై జి.వీరబాబు, సీసీఎస్ ఎస్సై బి.సాగర్ బాబు, ఎస్.కోట ఎస్సై జె.తారకేశ్వరరావు, సీసీఎస్ ఏఎస్సై ఎ.గౌరీశంకరరావు, హెచ్‌సీలు దాసరి శంకరరావు, మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, జి.మహేశ్వరరావు, ఎస్.ఈశ్వరరావు, కానిస్టేబుళ్లు ఎం.చిరంజీవి రాజు, ఎస్.రమణ, ఎన్.గౌరీశంకర్, హోంగార్డు జె.నారాయణరావులు ఎంతో శ్రమించి కేసుల మిస్టరీని ఛేదించారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో విజయనగరం డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ జి.రాంబాబు, ఎస్సైలు జి.వీరబాబు, బి.సాగరబాబు, ప్రశాంతకుమార్, నసీమా బేగం, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రికవరీ చేసిన ట్రాక్టర్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ

బాధితులకు 80 మొబైల్స్ అందజేత



రికవరీ చేసిన ఫోన్‌ను బాధితురాలికి అందజేస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్‌ను ట్రేస్ చేసేందుకు పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన వాట్సాప్ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 80 స్మార్ట్ ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వివరాలను వెల్లడించి, బాధితులకు ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం మొబైల్ ట్రాకర్ డాట్ ఇన్ వెబ్‌సైట్, వాట్సాప్ నంబర్ 8977945606కు వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, రూ.13.88 లక్షల విలువైన 80 ఫోన్‌లను రికవరీ చేయగలిగామన్నారు. మనరాష్ట్రంలోని ఇతర జిల్లాలు, ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న వారు పోయిన మొబైల్స్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. సైబర్‌సెల్ పోలీసులు మొబైల్ వినియోగిస్తున్న వారితో మాట్లాడి, ఆయా ప్రాంతాల నుంచి వాటిని రికవరీ చేశామన్నారు. రికవరీ చేయడానికి ఎంతో శ్రమించి, పనిచేసిన సైబర్ సెల్ ఎస్సై ఎం.ప్రశాంత్‌కుమార్, కానిస్టేబుళ్లు బి.వాసుదేవరావు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాజేష్, టి.తిరుపతినాయుడులను ఎస్పీ అభినందించారు. రికవరీ చేసిన 80 మొబైల్స్‌ను ఎస్పీ ఎం.దీపిక చేతులమీదుగా బాధితులకు తిరిగి అందజేయడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ జి.రాంబాబు, ఎస్సైలు ప్రశాంతకుమార్, నసీమాబేగం, సాగర్‌బాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మరో 28 మందికి ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ

భోగాపురం: భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా గృహాలు కోల్పోయిన బొల్లింకలపాలెం, ముడసర్లపేట, రెల్లిపేట, మరడపాలెం గ్రామాలకు చెందిన సుమారు 376 కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించింది. గూడెపువలస, పోలిపల్లి రెవిన్యూ పరిధిలో సువిశాలమైన 5 సెంట్లు భూమితో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.9.20 లక్షలు అందజేసింది. నిర్వాసిత కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అయితే, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ 2013 చట్టం ప్రకారం 2015 నాటికి గృహాలు కోల్పోయిన వారి కుటుంబంలో18 ఏళ్లు నిండిన వారికి వర్తింపజేసి, నష్ట పరిహారంతో పాటు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ బొల్లింకలపాలెం, రెల్లిపేట, ముడసర్లపేట, మరడపాలెం గ్రామాలకు చెందిన మొత్తం 28 నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో పాటు 5 సెంట్లు ఇళ్ల స్థలాలను మంజూరుచేస్తూ సోమవారం ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు విమానాశ్రయ నిర్వాసిత గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అడవులతో ఆరోగ్యకర జీవనం

- విజయనగరం జిల్లాలో 6 శాతమే అడవులు
- జిల్లా విభజన తరువాత తగ్గిన విస్తీర్ణత శాతం
- జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మొక్కలు పంపిణీకి ఏర్పాట్లు
- ఇప్పటికే 1.40 లక్షల మేర పంపిణీ
- నేడు అటవీదినోత్సవం



రాజాం: మనిషికి ప్రాణవాయువును అందించేవి చెట్లు. వాటిపైనే మానవ జీవనం ఆధారపడి ఉంది. పర్యావరణ సమతుల్యతకు అడవులే ప్రధానం. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 18 శాతం (విజయనగరంలో 6శాతం, పార్వతీపురం మన్యంలో 12 శాతం) అటవీ విస్తీర్ణం ఉంది. ఇది 33 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని అటవీశాఖ అధికారులు స్పష్టంచేస్తున్నారు. అటవీ విస్తీర్ణం పెరిగిన నాడు వన్యప్రాణాలు జనసంచార ప్రాంతాల్లోకి రావని, పంటలు నాశనం చేసే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఈ నెల 21న అటవీదినోత్సవాన్ని పురస్కరించుకుని అడవుల ప్రాధాన్యంను ఊరూరా వివరించేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో పచ్చదనం పెంచేలా...

విజయనగరం జిల్లాలో అటవీశాతం పెంచేందుకు అవకాశం లేదు. ఎక్కువ వ్యవసాయాధారిత భూములే ఉన్నాయి. 6 శాతం ఉన్న అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు జిల్లా అటవీశాఖ వినూత్న ప్రయోగాలు చేస్తోంది. గతేడాది 5 లక్షలు మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుంది. 40 వేల మొక్కలను రహదారులు, చెరువు గట్లు, పొలాలు గట్లపై నాటేందుకు పంపిణీచేసింది. నర్సరీలు ద్వారా రైతులు పంటపొలాల్లో వేసేందుకు 50 వేల మొక్కలు మేర పంపిణీ చేయగా, నగర వనాలు పథకానికి మరికొన్ని మొక్కలను అందజేసింది. వీటితో పాటు ఉపాధి హామీ పథకం కింద మరో 50 వేల మొక్కలు పంపిణీ చేసి సంరక్షించే చర్యలు చేపట్టింది. జిల్లాలో పూల్‌బాగ్, వెలగాడ, గంటికొండ, మారిక, కోనూరు తదితర ప్రాంతాల్లో అడవులు విస్తీర్ణం అధికంగా ఉంది. సారిపల్లి వద్ద నగర వనం కార్యక్రమాన్ని గతేడాది జిల్లా ఫారెస్ట్ శాఖ ప్రారంభించింది. మరోవైపు టేకు, చందనం మొక్కల పెంపకానికి రైతులను ప్రోత్సహిస్తున్నట్టు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్ తెలిపారు.

మాల్‌ప్రాక్టీస్‌ను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: వచ్చే నెల 3వ తేదీ నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు జరగనున్నందున పరీక్ష కేంద్రాలను హై సెక్యూరిటీ జోన్లుగా మార్పుచేస్తున్నామని డీఈఓ లింగేశ్వరరెడ్డి తెలిపారు. డిప్యూటీ డీఈఓ తిరుపతిరాయుడితో కలిసి సోమవారం రామభద్రపురంలో విలేకర్లతో మాట్లాడారు. ఎగ్జామ్స్ యాక్ట్-25 ప్రకారం పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన, పేపర్ లీకేజీ, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశ్నపత్రంపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రించారని, ఏదైనా కేంద్రం నుంచి ప్రశ్నపత్రం లీక్ అయితే అది ఎక్కడ జరిగిందో గుర్తించే విధానాన్ని విద్యాశాఖ అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ఎన్నికల మాదిరిగా పరీక్షల నిర్వహణలోనూ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పాటించాలని స్పష్టం చేశారు. డ్యూటీ పాస్ లేకుండా పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించరాదన్నారు. విద్యార్థులకు రోల్ నంబర్ ఆధారంగా సీటింగ్ ఏర్పాటుతో పాటు ఓఎంఆర్ షీట్, ప్రశ్న పత్రాలను వారి సీరియల్ నంబర్ వారీగా పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రతీ విద్యార్థికి 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్‌ను ఇస్తామని, అదనంగా అవసరమైతే 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తామన్నారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రెల్లి వీధిలో కుంపటి నిప్పులు తాటి కమ్మలకు అంటుకోవడంతో గ్రామానికి చెందిన ధనాల లక్ష్మి పూరిల్లు దగ్ధమైనట్లు వీఆర్వో కూర్మారావు సోమవారం తెలిపారు. నిరుపేద అయిన లక్ష్మి రైల్వే ట్రాక్ వద్ద జొన్న పొత్తులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. అగ్ని ప్రమాదం జరగంతో ఇంటిలో ఉన్న సామగ్రితో పాటు కొంత నగదు కాలి బూడిదై రూ.ముప్పై వేల వరకు ఆస్తినష్టం జరిగిందని ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు వీఆర్వో తెలిపారు.

క్యాన్సర్‌కు పొగాకు ఉత్పత్తులే కారణం



ర్యాలీని ప్రారంభిస్తున్న రమణకుమారి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి

విజయనగరం ఫోర్ట్:

పొగాకు ఉత్పత్తులైన సిగరెట్లు, ఖైనీ, గుట్కాలు తినడంవల్ల నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి తెలిపారు. నోటిశుభ్రతపై వైద్యఆరోగ్య సిబ్బంది చేపట్టిన ర్యాలీని సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికకారం, ఘాటు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. శీతలపానీయం వినియోగం తగ్గించాలని చెప్పారు. తిన్న వెంటనే నోటిని శుభ్రం చేసుకోవాలన్నారు. తీపి పదార్థాలు వీలైనంతవరకు తక్కువ తీసుకోవాలని సూచించారు. రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవడం ఉత్తమమన్నారు. పోషకవిలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీపీఓ డాక్టర్ పి.రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, డెమో చిన్నతల్లి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న సింహాచలం

పార్వతీపురం: తాగి వచ్చినందుకు కొడుకు మందలించడంతో మనస్తాపం చెందిన కొమరాడ మండలం దుగ్గి గ్రామానికి చెందిన టి.సింహాచలం పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ ఘటనపై పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సింహాచలం ఇంటికి తాగి రావడంతో కుమారుడు వినోద్ ఎందుకు రోజూ తాగివచ్చి న్యూసెన్స్ చేస్తున్నావని మందలించి పోతావా పోవా అంటూ కోపంగా అనడంతో మనస్తాపం చెందిన సింహాచలం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి చనిపోతానంటూ తాగేశాడు. అది గమనించిన కుమారుడు పురుగు మందుడబ్బాను లాక్కుని తాగిన మందు బయటకు వచ్చేలా ప్రయత్నించాడు. అనంతరం ద్విచక్రవాహనంపై చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించాడు.

సివిల్ ఇంజినీరింగ్‌కు మంచి డిమాండ్

- సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని విద్యార్థులకు వీసీ పిలుపు
- జేఎన్‌టీయూ జీవీలో 'ప్రగతి టూకె 23' సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: సివిల్ ఇంజినీరింగ్‌కు మంచి డిమాండ్ ఉందని, కాలానుగుణంగా ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు మెరుగుపరుచుకోవాలని జేఎన్‌టీయూ విజయనగరం గురజాడ (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ప్రగతి టూకె 23' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియంను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ చేసే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. తరగతిగదిలో నేర్చుకున్న విజ్ఞానానికి అనుగుణంగా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతానికి స్వచ్ఛమైన నీటిపంపిణీ వ్యవస్థను రూపొందించే అవకాశం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉంటుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులపాత్ర కీలకమన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే టెక్నికల్ సింపోజియం సదస్సులకు హాజరయ్యే విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునే అవకాశం ఉంటుందన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు టీవీఎస్ డి.ఫణీంద్రనాథ్, ఆర్.బాలమురళీకృష్ణ కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు. స్టూడెంట్ కో ఆర్డినేటర్లుగా ఎం.అజయ్‌కుమార్, బి.సాయిచందన వ్యవహరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు హాజరయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

విజయనగరం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించాలని జేసీ మయూర్ అశోక్ ఆదేశించారు. స్పందన హాల్ వద్ద ఐసీడీఎస్ పోషణ్‌పక్వాడాలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించారు. పిల్లలకు, మహిళలకు అందించే పాలప్యాకెట్‌లను తనిఖీ చేశారు. గడువు తేదీని పరిశీలించి పాలప్యాకెట్లు తీసుకోవాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం నాణ్యతపై ఆరా తీశారు. రాగులు, జొన్నలు తదితర చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను తిలకించారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు 15 రోజులపాటు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నట్టు ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి జేసీకి వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ ప్రసన్న, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలకు పక్కా ఏర్పాట్లు

విజయనగరం అర్బన్: ఈ ఏడాది శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 22న ఉదయం 9 గంటలకు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు సోమవారం తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. వేడుకల్లో భాగంగా అన్నమాచార్య కీర్తనలు, వేదపఠనం, పంచాంగ శ్రవణం, అతిథుల సందేశాలు ఉంటాయన్నారు. వేడుకల్లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జేసీ, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు భాగస్వామ్యం అవుతారని వెల్లడించారు. జిల్లా ప్రజలు ఉగాది వేడుకలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని డీఆర్వో పేర్కొన్నారు.

మేఘమాల..



కుండపోత



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో వాతావరణం చల్లబడింది. మూడు రోజులుగా అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. విజయనగరం పట్టణంలో సోమవారం మేఘాలు దోబూచులాడాయి. నీటి మూటను విప్పకుండానే కనుమరుగయ్యాయి. బొండపల్లి, గజపతినగరంలో మాత్రం కుండపోతగా వర్షాన్ని కురిపించాయి. దీనికి ఈ చిత్రాలే నిలువెత్తు సాక్ష్యం.

– బొండపల్లి/ సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం